# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023




### ఖర్గే సమక్షాన కాంగ్రెస్‌లోకి..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షాన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

2లో



### అంగన్‌వాడీల ఆందోళన

పనిభద్రతతో పాటు కనీస వేతనం చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

2లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

### వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడతాయి.

## న్యూస్‌రీల్

### రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలను అందజేశారు.

### ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, భద్రాచలం ఏజెన్సీలోని ఆదివాసీల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఏజెన్సీలో భూములకు సంబంధించిన కేసులు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పోడు భూముల సమస్య పరిష్కారానికి తహసీల్దార్లు, ఆర్‌ఐలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. పెసా, 1/70 యాక్ట్ ప్రకారం ఎల్టీఆర్ భూ వివాదాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే వివరాలతో నివేదిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, డీడీ మణెమ్మ, ఆశోక్‌కుమార్, సురేష్‌బాబు, భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

# ముర్రేడుకు గేబియన్

### రక్షణ కోసం గోడ నిర్మాణం

- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- వానాకాలంలో పోటెత్తుతున్న వరద
- కోతకు గురవుతున్న వాగు తీరం



గేబియన్ డిజైన్‌తో నిర్మించిన రక్షణ గోడ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రం నడిబొడ్డున ప్రవహిస్తున్న ముర్రేడు వాగు కోతల నుంచి తీర ప్రాంత వాసులకు అభయం లభించనుంది. వానాకాలంలో వచ్చే వరదల నుంచి రక్షణ గోడ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.35 కోట్లు కేటాయించింది. దీంతో త్వరలోనే గేబియన్ డిజైన్‌తో రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

**వానాకాలం వస్తే..**

కొత్తగూడెం పట్టణం మీదుగా గోధుమవాగు, ముర్రేడువాగులు ప్రవహిస్తున్నాయి. ఇందులో ముర్రేడువాగు వెంబడి అనేక కాలనీలు విస్తరించి ఉన్నాయి. వందలాదిగా నివాస గృహాలతో పాటు విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, వివిధ మతాల ప్రార్థనాలయాలు ఉన్నాయి. ప్రతీ ఏడాది వానాకాలం వస్తే ముర్రేడు వాగుకు వరద పోటెత్తుతుంది. ఇరు వైపులా తీరాలను తాకుతూ ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతం కోతకు గురవుతోంది. దీంతో ప్రతీ ఏడాది తీరం వెంట పదికి పైగా నిర్మాణాలు నీటిపాలవుతున్నాయి. ఈ మేరకు ఆయా కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే 40కి పైగా ఇళ్లు ముర్రేడులో కలిసిపోయాయి. దీంతో వాగు కోతలతో తలెత్తుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పలుమార్లు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. తీర ప్రాంత ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసింది.

**వంతెనకు ఇరువైపులా..**

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.35 కోట్ల నిధుల్లో ముర్రేడుకు రక్షణ గోడ నిర్మించనున్నారు. వాగుకు ఇరువైపులా కాకుండా వరద తీవ్రతతో ఎక్కువగా కోతకు గురవుతున్న లక్ష్మీదేవిపల్లి వైపునే ఈ గోడ నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో సాయిబాబ గుడి వైపు ప్రధాన రోడ్డు నుంచి 400 మీటర్లు, సాయిబాబా గుడికి ఎదురుగా ప్రధాన రహదారి నుంచి 1.20 కిలోమీటర్ల నిడివితో రక్షణ గోడ నిర్మిస్తున్నారు. మొత్తంగా ముర్రేడుపై 1.60 కి.మీ. నిడివితో రక్షణ గోడ నిర్మాణం జరగనుంది. ఈ మేరకు జిల్లాలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా గేబియన్ డిజైన్ ఎంపిక చేశారు.

**ప్రత్యేక రక్షణ**

వాన నీటి కారణంగా భూమి కోతకు గురికాకుండా రక్షణ కల్పించే డిజైన్లలో గేబియన్ వాల్ ఒకటి. ఈ డిజైన్‌ను కొండ ప్రాంతాల్లో ఘాట్ల రోడ్ల రక్షణ విషయంలో ఎక్కువగా వినియోగిస్తారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులను బట్టి జల ప్రవాహాల నుంచి రక్షణ కోసం కూడా ఈ డిజైన్ వినియోగిస్తున్నారు. ఇటీవల వారణాసిలో గంగా తీరం వెంబడి ఈ తరహాలో గేబియన్ వాల్ నిర్మించి అక్కడున్న జైన మందిరానికి రక్షణ కల్పించారు. రాష్ట్రంలో యాదగిరిగుట్టపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఈ గేబియన్ వాల్ డిజైన్‌ను విస్తృతంగా ఉపయోగించారు.

**రాళ్లు, మెష్‌తో**

వాగులు, కాల్వలు, నదులు వెంబడి రక్షణ గోడల నిర్మాణంలో ఆర్‌సీసీ కాంక్రీట్‌ను ప్రధానంగా ఉపయోగిస్తారు. గేబియన్ డిజైన్‌లో ఆర్‌సీసీ కాంక్రీట్ బదులు బండరాళ్లు, ఐరన్‌మెష్‌ను (ఇనుప తీగల కంచె) ఉపయోగిస్తారు. వాగులో నీటి ప్రవాహ స్థాయి నుంచి పైన ఒడ్డు అంచుల వరకు రాళ్లను పేరుస్తారు. ఈ రాళ్లు జారిపోకుండా ఐరన్‌మెష్‌తో కడతారు. ఈ నిర్మాణానికి మరింత దృఢత్వాన్ని తెచ్చేందుకు ఆరు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు ఉండేలా మెష్‌ను గట్టిగా నేలకు బిగిస్తారు. ఈ డిజైన్‌లో పెద్దగా మెయింటనెన్స్ ఖర్చు ఉండదు. ఎక్కడైనా మెష్, రాళ్లు పోతే వాటిని పునరుద్ధరిస్తే చాలు. త్వరలోనే గేబియల్ వాల్ నిర్మాణానికి సంబంధించి టెండర్లు పిలువనున్నట్లు జలవనరుల శాఖ ఈఈ అర్జున్ తెలిపారు.

### బాధితుల కష్టం కళ్లారా చూశా..



ముర్రేడువాగు కారణంగా ప్రతీ ఏడాది ఇళ్లు కూలిపోతున్నాయి. బాధితులను పరామర్శించడానికి వెళ్లినప్పుడు వారి కష్టం కళ్లారా చూశాను. దీంతో సీఎం కేసీఆర్ కొత్తగూడెం వచ్చినప్పుడు ముర్రేడుపై రక్షణ గోడ నిర్మించాలని, అందుకు నిధులు విడుదల చేయాలని కోరాను. దీంతో రూ. 35 కోట్లు మంజూరు చేశారు.

– వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

# ఉత్సవాలకు పటిష్ట భద్రత

### ఎస్పీ వినీత్ వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటికి తాళం చేసి ఎక్కువ రోజులు ఊరికి వెళ్లేవారు సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వాట్సాప్ ద్వారా 7992123234 నంబర్‌కు ఇంటి లోకేషన్, అడ్రెస్ తెలిపితే గస్తీ పెంచుతామని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండప ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించి నిబంధనలు వివరించాలని చెప్పారు. వివిధ ప్రాంతాలు నుంచి నిమజ్జనానికి భద్రాచలం వద్ద గోదావరి నదికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వివిధ స్టేషన్‌లలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు రమణమూర్తి, రాఘవేంద్రరావు, వెంకటేష్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ కృష్ణయ్య పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణా నేరం

పాల్వంచరూరల్ : మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆర్థిక అవసరాల కోసం ఉపాధి కల్పిస్తామని చెబుతూ మహిళలు, పిల్లలను బలవంతంగా వెట్టిచాకిరీ, లైంగిక దోపిడీ, బానిసత్వంలోకి నెట్టివేస్తూ వారితో అసాంఘిక కార్యక్రమాలు చేయిస్తున్నారని చెప్పారు. అలాంటివారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కాసాని రమేష్, డిప్యూటీ లీగల్ అండ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అనుబ్రోలు రాంప్రసాద్, అసిస్టెంట్ కౌన్సిళ్లు జ్యోతి, విశ్వకర్మ, నాగ ప్రవంతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం..

- పీఓపీ విగ్రహాలతో నష్టం అంటున్న పర్యావరణ నిపుణులు
- కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన నేడు విగ్రహాల పంపిణీ

చుంచుపల్లి: ఆది దేవుడైన గణపతిని పూజించే వినాయక చవితి వేడుకలకు గ్రామాలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు గణనాథులు పూజలందుకోనున్నారు. అయితే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని, అదే ఆచారమని పర్యావరణ పరిరక్షకులు, నిపుణులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. ఇవి గాక ప్రతి ఇంటా వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. మండపాల్లో అందం, ఆకర్షణ కోసం రంగురంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతుంటారు. ఇదే పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతోంది. పర్యావరణహితంగా వేడుకలు నిర్వహిస్తే ప్రజలను, పర్యావరణాన్ని రక్షించుకున్న వారమవుతామని పలువురు అంటున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. ఈ మేరకు పలు సంస్థల వారు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**పీఓపీ విగ్రహాలతో అనర్థాలు..**

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, వాగులు, నదుల్లో నిమజ్జనం చేస్తే అవి త్వరగా కరగవు. వాటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులు, ఇతర జీవుల జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిసిన నీటితో నరాలపై ప్రభావం చూపి కేన్సర్ వ్యాధికి దారితీస్తుంది. అనేక చర్మవ్యాధులు సైతం వ్యాప్తి చెందుతాయి. ఈ నీరు పంట పొలాల్లో చేరి దిగుబడి తగ్గడమే కాక ఆహార ఉత్పత్తులు కలుషితం అవుతాయి.

**మట్టి విగ్రహాలే మేలు..**

వినాయకుడిని పార్వతీదేవి మేని నలుగు మట్టితోనే తయారు చేసిందని, గణనాథుడిని పూజించే 21 రకాల పూజాపత్రాలు కూడా మట్టి నుంచే ఉత్పత్తి అవుతాయని పురాణాలు చెబుతున్నాయి. సహజసిద్ధంగా పొలాల్లో లభించే బంక మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేయడం మంచిదని, ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయని, ఈ మట్టితో ఎవరికీ ఎలాంటి నష్టం ఉండదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది మరింత ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చని అంటున్నారు.

**నేడు మట్టి విగ్రహాల పంపిణీ..**

వినాయక చవితి సందర్భంగా ప్రతి సంవత్సరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రెండువేల మట్టి విగ్రహాలను కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, పాల్వంచ బస్టాండ్ వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆదివారం పంపిణీ చేయనున్నారు. అంతేకాక ఈసారి వినాయక మండపాల్లో వినియోగించే మట్టి విగ్రహాలకు రూ.10 లక్షల వరకు బహుమతులను ఇవ్వాలని నిర్ణయించారు. మట్టి విగ్రహాల వినియోగం, మండపాల అలంకరణ వంటి విషయాల్లో ఆన్‌లైన్‌లో క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తారు. ప్రశ్నలకు సమాధానాలు, ఫొటోలను www.tspcbcgg.gov.inలో ఈ నెల చివరి వరకు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.10,000, రెండో బహుమతి రూ. 5000, మూడో బహుమతి రూ.3000 చొప్పున అందజేయనున్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్ : పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను శనివారం ఐడీఓసీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల నిమజ్జనంతో నీటిలో బతికే ప్రాణులకు హాని కలుగుతుందని అన్నారు. మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రవీందర్ కలెక్టర్‌కు మట్టి వినాయక ప్రతిమ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్వో రవీంద్రనాథ్, భద్రాద్రి రామాలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

### మట్టి విగ్రహాలతోనే ప్రయోజనం



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణాన్ని రక్షించవచ్చు. ఈ వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని ఆదేశాలు జారీ చేశాం. హైదరాబాద్ నుంచి జిల్లాకు తెప్పించిన 2 వేల మట్టి విగ్రహాలను కొత్తగూడెం, పాల్వంచలో నేడు పంపిణీ చేయనున్నాం. మట్టి విగ్రహాలతో ప్రయోజనాలపై వాల్ పోస్టర్ల ద్వారా వివరిస్తున్నాం.

– బి.రవీందర్, పర్యావరణ ఇంజనీర్

# విద్యుత్ అనుమతి తప్పనిసరి

### కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ అనుమతి తప్పక తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. శనివారం ఐడీఓసీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అనుమతి లేకుండా అక్రమ విద్యుత్ వినియోగం నేరమని, వైర్లు వేలాడదీయడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. శోభాయాత్రలో కూడా విగ్రహాలు విద్యుత్ తీగలకు తగలకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. మండపాల్లో మైకు ఏర్పాట్లకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు సిబ్బందితో చెత్త తొలగింపజేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధికారులు అనుమతి ఇచ్చిన ఘాట్లలో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. భద్రాచలం గోదావరి నది కి జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాల నిమజ్జనానికి వస్తారని, భక్తులు, అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. క్రేన్లు, లాంచీలు, పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీపీఓ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్, భద్రాద్రి ఆలయ ఈఓ రమాదేవి, మత్స్యశాఖ అధికారి వీరన్న, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ సమైక్యత దినోత్సవానికి ఏర్పాట్లు**

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రియాంక తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఐడీఓసీలో జరిగే వేడుకల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 8 గంటల వరకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

### 19న కేటీఆర్ సమక్షాన బీఆర్‌ఎస్‌లోకి..

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల బీజేపీకి, పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన కోనేరు సత్యనారాయణ(చిన్ని) ఈనెల 19న హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు చిన్ని శనివారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. తన తండ్రి కోనేరు నాగేశ్వరరావు, కేసీఆర్ స్నేహితులని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోనికి వస్తుందని, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు వెంకటకృష్ణ, రవిగౌడ్, శోభ, హఫీజ్, ఖాసీం, బాబురావు, సురేష్, రాంబాబు తదితరులు ఉన్నారు.



# ఉద్యమాల పురిటిగడ్డ.. ఖమ్మం

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర

- దొరల పెత్తందారీ ఆగడాలకు అడ్డుకట్ట
- పేదలకు లక్షల ఎకరాల భూపంపిణీ
- నేటికీ స్థూపాల రూపంలో అమరుల త్యాగాలు

భూమి, భుక్తి సాధించడమే కాక వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన నేల ఇది! తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జిల్లా వాసులు అనేక మంది కీలకపాత్ర పోషించగా, ప్రాణాలు సైతం అర్పించారు. పెత్తందారులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములే కాక నిజాం సైన్యాలను ఎదురొడ్డి పోరాడారు. ఈ క్రమంలో పలువురు అమరులైనా వెన్ను చూపలేదు. వీరి త్యాగాలకు గుర్తుగా అనేక గ్రామాల్లో అమరుల స్తూపాలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమయ్యాక ఇక్కడి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. అయితే, సెప్టెంబర్ 17న పార్టీల వారీగా వివిధ పేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. ఆనాటి ఘటనలను వృద్ధులు గుర్తు చేసుకుంటున్నారు.

### దళాలకు నీడనిచ్చిన ఇల్లెందు తాలూకా

ఇల్లెందు: తెలంగాణకు స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ఇల్లెందు తాలూకా మమేకమైంది. నిజాం పాలనపై తిరగబడిన ఉద్యమగడ్డగా అప్పటి ఇల్లెందు తాలూకాలోని గార్లకు స్థానం దక్కుతుంది. వేదనాయకపురం హరిజనులు, వివిధ గ్రామాల వలంటీర్లు దేశ్‌ముఖ్ కారంముంతల రంగారెడ్డిని బయ్యారం మండలం కోటగడ్డలో హతమార్చారు. ఇందులో పాల్గొన్న దళాలు ఇల్లెందు, బేతంపూడి, సుదిమళ్ల, కొల్లాపురం, తొడిదెలగూడెం, ముకుందాపురంలో ఆశ్రయం పొందాయి. ఇక్కడ జరిగిన అనేక పోరాటాలకు దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు నాయకత్వం వహించడం విశేషం. ఇక సాయుధ దళాలకు తుమ్మా శేషయ్య, మారుతీ ముత్తిలింగం, కుంటి పంతులు, బుచ్చిమల్లు, పాటి జగ్గయ్య, వాసయ్య, సుంకరి మల్లయ్య, దామినేని వెంకటేశ్వరరావు, కేఎల్.నర్సింహారావు, ఏలూరి లక్ష్మీనారాయణ అగ్రభాగాన నిలిచారు. తొడిదెలగూడెంకు చెందిన మారుతీ ముత్తిలింగం గుల్బర్గాలో జైలు జీవితం గడిపారు. కాగా, నైజాం పాలనను వ్యతిరేకిస్తున్న దళ నేతలు 42 మందిని 1948లో బయ్యారం మండలంలోని బండ్లకుంట సమీపాన కాల్చిచంపారు. ఆ తర్వాత మృతదేహాలను బయ్యారం–గార్ల మండలాల్లో ఎడ్లబండ్లపై ఊరేగించడంతో పాటు వివిధ గ్రామాల్లో 30 మందిని రెండు రోజుల్లో కాల్చిచంపి ప్రజల్లో తీవ్ర భయాన్ని నెలకొల్పారు. బేతంపూడిలో జన్మించిన కే.ఎల్.నర్సింహరావు, బయ్యారం మండలం పెత్తాళ్లగడ్డకు చెందిన గడ్డం వెంకట్రామయ్య, తొడిదెల గూడెంకు చెందిన మారుతీ ముత్తిలింగం, కుంటి పంతులు, గాంధీనగర్‌కు చెందిన ఏలూరి లక్ష్మీ నారాయణ పోరాటంలో పాల్గొనగా... తూటాలకు బలైన వారిలో బయ్యారం మండలానికి చెందిన మాడె పాపయ్య, బీరెల్లి లక్ష్మయ్య, కంబాల చంద్రయ్య, సింగరబోయిన గంగయ్య, పోశం లచ్చయ్య, కారం మల్లయ్య, తాటి బాలయ్య, కారం గాదయ్య, తాటి మల్లయ్య తదితరులు ఉన్నారు.



బయ్యారం గాంధీ సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం

### ఒకే చితిపై ఏడుగురి దహనం

బోనకల్: కట్టుబానిసల్లా పని చేయించుకుని పట్టెడన్నం పెట్టడానికి కూడా చేయిరాని నైజాం నవాబులు, భూస్వాముల వ్యవస్థకు వ్యతిరేకంగా తుపాకీ పట్టి తరిమికొట్టిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు పురిటిగడ్డగా బోనకల్ నిలుస్తుంది. బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన రావెళ్ల జానకీ రామయ్య ఆంధ్ర మహాసభ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన నాయకత్వంలో గోవిందాపురం, లక్ష్మీపురం, తూటికుంట్ల, ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి, సీతానగరం, రాయన్నపేటకు చెందిన అనేక మంది ఉద్యమకారులు పోరాటంలో పాల్గొన్నారు. వీరిలో లక్ష్మీపురానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లును దళ కమాండర్‌గా, గోవిందాపురానికి చెందిన తమ్మారపు గోవింద్, చుండూరు నరసింహారావు, జొన్నలగడ్డ రామయ్యను ప్రజానాయకులుగా నియమించుకుని దళ సభ్యులుగా యువకులకు శిక్షణ ఇచ్చి పోరాటం సాగించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అంతమొందించేందుకు నైజాం నవాబు, రజాకార్లు ఉద్యమకారులపై దాడులు చేసినా పోరాటం ఆపలేదు. దీంతో యోధుల సమాచారం చెప్పాలని ఆళ్లపాడుకు చెందిన యలమందల చంద్రయ్య, మందా అచ్చయ్య, వల్లాపురానికి చెందిన గొర్రెముచ్చుల హజరయ్య, మద్ది రాములు, మడుపల్లి వీరస్వామి, సామినేని గోపయ్య, రేపల్లెవాడకు చెందిన తమ్మినేని బుచ్చయ్యను చిత్రహింసలు పెట్టి రేపల్లెవాడ శివార్లలో కాల్చిచంపారు. ఆ తర్వాత మృతదేహాలను గుర్రాలతో ఈడ్చుకుంటూ గోవిందాపురం ఊరిబయట మంగలి గుట్టపై ఒకే చితిపై వేసి ప్రజలందరూ చూస్తుండగా దహనం చేశారు. అయినా యోధులు పోరాడి స్వాతంత్ర్యం సాధించుకోగా.. వారి త్యాగాలను స్థానికులు నేటికీ గుర్తుచేసుకుంటారు.



గోవిందాపురం మంగలిగుట్టపై ఏడుగురిని దహనం చేసిన చోట నిర్మించిన స్తూపం

## క్లుప్తంగా

### 'డిజిటల్ కీ' దుర్వినియోగంపై ఇంటెలిజెన్స్ ఆరా?

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విచారణలేకుండా, ఫైల్‌లో సంతకం చేయకుండా ఎస్టీ కుల సర్టిఫికెట్ జారీ చేసిన ఘటనపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మండల పరిధిలోని ఓ యువతి ఆర్ఐ ధ్రువీకరణ లేకుండానే తహసీల్దార్ డిజిటల్ సంతకంతో ధ్రువపత్రం పొందినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఘటనపై ఆర్ఐ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఉదంతంపై 'డిజిటల్ కీ దుర్వినియోగం' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించగా, ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, సమగ్ర సమాచారం సేకరించినట్లు తెలిసింది. మండలకేంద్రంతోపాటు జగన్నాథపురం గ్రామాన్ని క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

### బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

టేకులపల్లి: బీజేపీతోనే గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాళ్ల సోమసుందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన పార్టీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కేంద్రంలో మళ్లీ తమ పార్టీనే గెలుస్తుందని, రాష్ట్రంలో కూడా విజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీకృష్ణ, దారావత్ బాలాజీ నాయక్, బోడ పూన్యానాయక్, చిక్కా వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### రామాలయ ఈఓ సీసీ మార్పు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి క్యాంప్ క్లర్క్(సీసీ) మార్పు జరిగింది. నూతన సీసీగా కె.వెంకటేశ్వరరావును ఈఓ రమాదేవి నియమించారు. ఖమ్మం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును డిప్యూటేషన్‌పై భద్రాచలం ఆలయానికి పంపించారు. ఆయనకు సీసీగా బాధ్యతలు అప్పగిస్తూ ఈఓ రమాదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సీసీగా పనిచేసిన అనిల్‌కు ఇతర విభాగాలను కేటాయించారు. కాగా దేవస్థానంలో పలు విభాగాల్లో అవినీతి చోటుచేసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఈఓ అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. కొన్ని విభాగాల్లో ఇప్పటికే కొందరు ఉద్యోగుల పాత్ర ఉందని తేలడంతో వారి నుంచి రికవరీ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

### ఏటీఎంల్లో హైటెక్ చోరీ

భద్రాద్రి బ్యాంకు పరిధిలో

రూ.79 లక్షలు మాయం

ఖమ్మంక్రైం: ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న భద్రాద్రి బ్యాంక్ ఏటీఎంల్లో భారీగా నగదు చోరీకి గురైంది. ఉమ్మడి జిల్లాలోని పలు ఏటీఎంల నుంచి దుండగులు రూ.79లక్షల మేర చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఖమ్మం టూటౌన్ ఎస్ఐ తోట నాగరాజు శనివారం సాయంత్రం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని ముఠా సభ్యులు భద్రాద్రి బ్యాంకు ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం కార్డు పెట్టే స్థానంలోనే కాక కీ ప్యాడ్‌పై మైక్రోచిప్‌లు అమర్చారు. తద్వారా నగదు డ్రా చేసుకునేందుకు వచ్చే ఖాతాదారుల ఏటీఎం పిన్ నంబర్లను తస్కరించారు. ఆతర్వాత వీటి సాయంతో చోరీకి పాల్పడినట్లు పోలీసులు చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అన్నిచోట్ల కూడా భద్రాద్రి బ్యాంకుల ఏటీఎంల నుంచి రూ.79లక్షల మేర చోరీ జరిగినట్లు ఆలస్యంగా గుర్తించగా, ఖమ్మం టూటౌన్ ప్రాంతంలోని భద్రాద్రి బ్యాంక్ ఏటీఎంలో అత్యధికంగా రూ.29లక్షలు చోరీ చేశారు. ఈమేరకు బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన సైబర్ ముఠాగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

### చిన్నారులపై కుక్కల దాడి




కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులు

ఇల్లెందు: పట్టణంలోని 22, 23 వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం 24 ఏరియాలో నివాసం ఉంటున్న యాసిన్ అనే వ్యక్తి ఇద్దరు కుమార్తెలు పాఠశాలకు వెళ్తుండగా మైనారిటీ స్కూల్ సమీపంలో వెంటపడి గాయపర్చాయి. చిన్నారుల తల భాగం, ముఖం మీద తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రజలు అదిలించడంతో కుక్కలు చిన్నారులను వదిలేశాయి. అనంతరం చిన్నారులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రులను మున్సిపల్ చైర్మన్ డీవెంకటేశ్వరరావు పరామర్శించారు.

### పాముకాటుతో మహిళ మృతి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన మాయర మల్లేశ్వరి(35) ఈ నెల 11న చేలో పత్తి తీస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతిరాలికి భర్త, పిల్లలున్నారు. ఎస్సై షాహీన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఖర్గే సమక్షాన కాంగ్రెస్‌లోకి..



పార్టీలో చేరిన తర్వాత ఖర్గేతో తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, ఠాక్రే, రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, యుగేందర్

## హస్తం గూటికి చేరిన మాజీ మంత్రి తుమ్మల

- బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ లేఖ
- సీడబ్ల్యూసీ హాల్‌లోకి తుమ్మలతో పాటు తనయుడు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరుల సంబరాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షాన పార్టీ కండువా కప్పుకున్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా నడుమ సీడబ్ల్యూసీ భేటీ జరుగుతుండడంతో అక్కడకు తుమ్మలతో పాటు ఆయన తనయుడు యుగేందర్‌ను మాత్రమే అనుమతించారు. తుమ్మల చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలం మరింత పుంజుకున్నట్లయింది. దీంతో పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకోగా, ఆదివారం తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు భారీగా తరలివెళ్లేందుకు ఆ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నాయి.

**చిరకాల ప్రత్యర్థి పార్టీకే జై...**

తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానం 1983లో ప్రారంభమైంది. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లోనే కాక 1989లోనూ సత్తుపల్లి నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. మళ్లీ 1994, 1999లో సత్తుపల్లి స్థానం నుంచే గెలిచారు. ఆతర్వాత 2004లో సత్తుపల్లి నుంచి పోటీ చేసి జలగం వెంకట్రావుపై ఓడిపోయారు. 2009లో సత్తుపల్లి స్థానం ఎస్సీకి రిజర్వ్ కావటంతో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన జలగం వెంకట్రావుపై స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై పోటీ చేసి ఓడిన తుమ్మల... తెలంగాణ ఏర్పాటుతో టీడీపీని వీడి టీఆర్ఎస్‌లో చేరారు. 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందినప్పటికీ.. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. అలా టీడీపీలో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం బీఆర్ఎస్‌లోకి చేరింది. తుమ్మల రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతోనే తలపడి గెలుపోటములను చవిచూశారు. తాజా మార్పుతో ఆయనకు తన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ పార్టీలోకే చేరారు.

**అనుచరుల సంబరాలు**

తుమ్మల కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయన అనుచరులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోనే కాక ఇతర నియోజకవర్గాల్లోనూ సంబరాలు జరిగాయి. బీఆర్ఎస్ టికెట్ నిరాకరించినప్పటి నుంచి నైరాశ్యంలో ఉన్న అనుచరుల్లో తుమ్మల కాంగ్రెస్‌లో చేరిక జోష్ నింపినట్లయింది. గత కొద్దిరోజులుగా ఆయనను కాంగ్రెస్‌లోనే చేరాలని అనుచరులు కోరుతుండగా... వారి విజ్ఞప్తితోనే 'చేయి' అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### విజయభేరికి భారీగా తరలేలా..

హైదరాబాద్‌లోని తుక్కుగూడ వద్ద ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన విజయభేరి సభ జరగనుంది. ఈసభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా వెళ్లేలా పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు తుమ్మల కూడా పార్టీలో చేరడంతో ఆయన అనుచరులే కాక సీఎల్పీ నేత భట్టి, పొంగులేటి అనుచరులు సిద్ధమయ్యారు. ఇంకా అన్ని నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న వారు సైతం తమ అనుచరులతో విజయభేరికి తరలేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

### కేసీఆర్‌కు రాజీనామా లేఖ

కాంగ్రెస్ పార్టీలోకి తుమ్మల చేరికకు ముహూర్తం కుదరడంతో ఆయన శనివారం.. సీఎం కేసీఆర్‌కి రాజీనామా లేఖ పంపారు. శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు, బీఆర్ఎస్ అధ్యక్షులు అని పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర సమితిలో నాకు సహకరించినందుకు ధన్యవాదాలు. పార్టీకి రాజీనామా సమర్పిస్తున్న' అని సంతకంతో లేఖ రాశారు. ఆతర్వాతే సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్న తాజ్ కృష్ణ హోటల్‌కి వెళ్లారు. తుమ్మలతో పాటు ఆయన తనయుడు యుగేందర్‌ని మాత్రమే అనుమతించగా, ఏఐసీసీ అధ్యక్షుడు మలికార్జునఖర్గే తమ్మలకు పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, నాయకులు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన టీచర్లు, హెల్పర్లు
- గేట్లు మూసివేసి అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

కొత్తగూడెంఅర్బన్: పనిభద్రత, కనీస వేతనాల అమలు, చట్టపరమైన హక్కుల అమలు కోసం అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నా చౌక్ నుంచి ర్యాలీగా తరలివచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని నినదించారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే పాలన స్తంభింపజేస్తామని హెచ్చరించారు. అప్పటికే పోలీసులు గేట్లు మూసివేయడంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గేటు ఎక్కి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కే. సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి వీడాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలపై చేస్తున్న దాడులను ఆపాలని కోరారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. స్వరాష్ట్ర పాలనలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఏజె.రమేష్, నరాటి ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, అంగన్‌వాడీ అసోషియేషన్ల నాయకులు వెంకటమ్మ, గోనె మణి, సీహెచ్.సీతామహాలక్ష్మి, రెడ్డి అరుణ, జయలక్ష్మి, భూక్య లలిత, పాయం శ్రీలత, ఇందిర, నర్సమ్మ, మమత, విజయశీల, వీరభద్రమ్మ, వెంకటరమణ, పద్మ, జ్యోతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు

పాఠశాలలో 47 మంది విద్యార్థులు



ఐదు తరగతులకు పాఠం బోధిస్తున్న టీచర్

టేకులపల్లి: మండలంలోని కొప్పురాయి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు మొత్తం 47 మంది బాలబాలికలు చదువుతున్నారు. వీరికి బాలాజీ అనే ఉపాధ్యాయుడు ఒక్కరే పాఠాలు బోధిస్తున్నాడు. అన్ని తరగతులకు అన్ని సబ్జెక్టుల పాఠాలు ఆయనే చెప్పాల్సి రావడం, విద్యార్థుల నోటు పుస్తకాల పరిశీలన, వివిధ రకాల రిపోర్టులు పంపించే పనులతో సతమతమవుతున్నాడు. ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ పాఠశాలకు మరో ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### సరుకుల బాకీ అడిగితే పోలీసులు బెదిరించారు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన షాపు నిర్వాహకుడు

పాల్వంచరూరల్: ఇచ్చిన సరుకుల తాలుకు డబ్బులు అడిగితే పోలీసులు బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎస్పీ, అవినీతి నిరోధక శాఖ డీజీలకు శనివారం ఫిర్యాదు చేసినట్లు బుడగం సత్యనారాయణ తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ మండల పరిధిలోని రాజాపురం గ్రామానికి చెందిన తాను కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని పేర్కొన్నారు. కిన్నెరసానిలో ఉన్న రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీరాములు అడిగితే స్టేషన్ అవసరాల నిమిత్తం డీజిల్, పెట్రోల్, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తదితర సామగ్రి అప్పుగా ఇచ్చానని వివరించాడు. సుమారు రూ.40 వేల బిల్లు కావడంతో, డబ్బులు అడిగానని, దీంతో తను బెదిరించి, మానసికంగా వేధిస్తున్నారని వాపోయాడు. పోలీసులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

# ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు..

- నిమజ్జనానికి గోదావరి వద్ద పటిష్ట బందోబస్తు
- భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్



మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్, పక్కన ఈఓ రమాదేవి

భద్రాచలం: గణేష నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ సూచించారు. శనివారం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రామాలయ ఈఓ రమాదేవితో కలిసి వేడుకలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఉత్సవ కమిటీ సభ్యులు కూడా ఆయా శాఖలను సంప్రదించి, ఉత్సవాలను విజయవంతంగా జరుపుకోవాలన్నారు. వేడుకల మొదటి రోజు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షించాలన్నారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పనిసరిగా విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. రక్షణ చర్యలపై విద్యుత్ అధికారులు మండపాల్లో 24 గంటలు ఆడిట్ నిర్వహించాలని అన్నారు. విద్యుత్ తీగలు తగలకుండా ఎత్తు తక్కువగా ఉండే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని అన్నారు.

**రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలి**

నిమజ్జనానికి పవిత్ర గోదావరికి రాష్ట్ర నలుమూలల నుంచి విగ్రహాలతో భక్తులు వస్తారని, అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు రవాణాశాఖ నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. మండపాల్లో భక్తిపాటలు మాత్రమే వినిపించాలని, మతాలు, ఇతర వర్గాల మనోభావాలను గౌరవించే విధంగా నిర్వహణ ఉండాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలని తెలిపారు. సమావేశంలో అధికారులు మధుసూదన్, శ్రీనివాస్, చెంగల్‌రావు, సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, గ్రామపంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జేబీఎస్‌లో 'అపూర్వ' సందడి



1975-76 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు

ఇల్లెందు: పట్టణంలో జేబీఎస్ పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1975 –76లో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకుని బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. పదో తరగతి పూర్తై 47 ఏళ్లు గడిచినా అందరూ హాజరై సందడి చేశారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడ్డవారు కూడా వేడుకకు హాజరయ్యారు. వీరి లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వసంతరావు(న్యాయవాది), జాఫర్‌ఖాన్(మాజీ ఎంపీడీఓ), మల్లయ్య(నాటి క్లాస్ లీడర్), సత్యనారాయణ, శ్యాంసుందర్ లాహోటీ, కరీం, శ్యాంసుందర్ ఖండేల్‌వాల్, సామ్రాజ్యం, వసుంధర, ఎల్లమ్మ, వీరమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు సముదాయంలో షార్ట్ సర్క్యూట్

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని రైటర్‌బస్తీ సమీపంలో ఉన్న జిల్లా కోర్టు భవన సముదాయంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏర్పడింది. మంటలు చెలరేగి వైరింగ్ కాలిపోయింది. న్యాయవాదుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ జరగలేదని న్యాయవాదులు తెలిపారు.

### కాకతీయ నగర్‌లో చోరీ

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయ నగర్‌లో ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాకతీయ నగర్‌కు చెందిన వేముల మణెమ్మ బంధువుల ఇంటికి వెళ్లగా దొంగలు ఇంట్లో చొరబడి రెండున్నర తులాల చంద్రహారం, రూ.9 వేల నగదు చోరీ చేశారు. శనివారం ఊరి నుంచి వచ్చిన మణెమ్మ చోరీ జరిగిందని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నాటుసారా స్వాధీనం

చర్ల రూరల్ : వాహనాల్లో తరలిస్తున్న 60 లీటర్ల నాటుసారాను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పెద్ద మిడిసిలేరు, ఆంజనేయపురం, కలివేరు, సత్యనారాయణ పురం, ఆర్.కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సారా తరలిస్తున్న గుంజి మాల్యాద్రి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్, ఎస్ఐ అనిల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ హనుమంతులపాడు స్టేజీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. హనుమంతులపాడు స్టేజీ వద్ద నివాసం ఉంటున్న ఉప్పునూతల ఉపేందర్ బస్సు దిగి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా ఇల్లెందు వైపు వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### స్కూల్ బస్సును ఢీకొట్టిన యాష్ ట్యాంకర్

పాల్వంచ: పట్టణంలోని శనివారం ఉదయం పాఠశాల విద్యార్థులను తీసుకెళుతున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సుకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రశాంత్ కాలనీ వైపు నుంచి వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును కేటీపీఎస్ కర్మాగారంలోకి బూడిద లోడు కోసం వెళుతున్న లారీ అల్లూరి సెంటర్ వద్ద ఢీకొట్టింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

### పురుగుల మందు తాగి ఆత్మహత్య

దుమ్ముగూడెం: మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు ల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముర్రం పుల్లయ్య(42) పుల్లయ్య భార్య పార్వతి పిల్లలతో కలసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడి బాధ్యతారాహిత్యంగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 9 గంటల సమయంలో పుల్లయ్య మద్యం తాగి ఉండగా, భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది మద్యం మత్తులోనే పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.

### మల్టీపర్పస్ వర్కర్ మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ చింత పవన్‌కల్యాణ్ (24) ఈ నెల 14న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి తల్లి లక్ష్మి ఉన్నారు. గ్రామంలో విషాదం నెలకొంది. మల్టీపర్పస్ వర్కర్ మృతిపట్ల సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మెట్టెల శిరోమణి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, కార్యదర్శి షర్మిల, గుమస్తా కిశోర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా...

### తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


భార్గవ్ ప్రసాద్

**పటాన్‌చెరు(అందోల్):** పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న కుమారుడిని తండ్రి మందలించగా మనస్తాపం చెందిన ఆ కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లాలో శనివారం వెలుగులోకి వచ్చింది. అందోల్ మండలం అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జంబుల భార్గవ్ ప్రసాద్ (14) పుల్కల్ మండలంలోని సింగూర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. 20 రోజుల క్రితం హాస్టల్‌లో భోజనం బాగోలేదని ఇంటికొచ్చాడు. తిరిగి వెళ్లకపోవడంతో ఈనెల 11న తండ్రి జంబులకుమార్ కుమారుడిని మందలించగా అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇటు స్కూల్‌కు వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈనెల 12న జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, కుమార్ ఇంటి వెనుక ముళ్ల పొదల్లో నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రసాద్ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కాగా, మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని గమనించారు. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య

- ప్రేమించాలంటూ వెంట పడటంతో ఆవేదన
- ఖమ్మం జిల్లాలో ఘటన

**కారేపల్లి (ఖమ్మంజిల్లా) :** ప్రేమించాలంటూ ఓ యువకుడు వెంటబడి వేధిస్తుండటంతో తట్టుకోలేక బాలిక భయపడి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాజలింగాలకు చెందిన మేకల నవీన్, కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన ఓ బాలిక వెంట పడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ వేధిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులకు చెప్పగా యువకుడిని మందలించి వదిలేశారు. అయినా తీరు మార్చుకోని ఆ యువకుడు శుక్రవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులు లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడి తనను ప్రేమించాల్సిందేనని బెదిరించడంతో భయపడిన బాలిక ఇంట్లోనే పురుగుమందు తాగింది. స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక శనివారం మృతి చెందింది. ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ తెలిపారు.

# అరబిక్ క్లాసుల ముసుగులో ఉగ్ర పాఠాలు!

**చెన్నైకు చెందిన ఐసిస్ ఉగ్రవాది వ్యవహారమిది**

- కొన్నాళ్లు హైదరాబాద్‌లోనూ నివాసం
- ఇటీవలే విదేశాలకు పారిపోయిన ఆ కీలక సూత్రధారి
- దర్యాప్తులో గుర్తించిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు
- నగరంలోని సానుభూతిపరుల ఇళ్లలో ముమ్మర సోదాలు
- పలు పుస్తకాలతో పాటు డిజిటల్ పరికరాలు స్వాధీనం



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ–తమిళనాడుల్లో ఉన్న కొన్ని కేంద్రాలు అరబిక్ క్లాసుల ముసుగులో ఉగ్రవాద పాఠాలు బోధిస్తూ, యువతను ఐసిస్ వైపు ఆకర్షిస్తున్నాయా? ఔననే అంటున్నాయి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) వర్గాలు. ఇలా ప్రేరేపించిన నేపథ్యంలోనే 2022 అక్టోబర్ 23 కోయంబత్తూరులోని సంగమేశ్వర దేవాలయం వద్ద కారు బాంబు పేలుడు జరిగిందని స్పష్టం చేస్తోంది. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చెన్నై ఎన్‌ఐఏ యూనిట్ శనివారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు చేసింది. హైదరాబాద్–తమిళనాడుల్లో మొత్తం 31 చోట్ల తనిఖీలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సోదాల్లో ఉగ్రవాద సంబంధిత పుస్తకాలు, పత్రాలతో పాటు ఫోన్లు, ల్యాప్‌టాప్స్, హార్డ్ డిస్కులు వంటి డిజిటల్ పరికరాలు, రూ.60 లక్షల నగదు, 18,200 అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పుస్తకాలు, పత్రాలు అరబిక్‌తో పాటు తెలుగు, తమిళం భాషల్లో ఉన్నట్లు అధికారులు వివరించారు. యువతను ఐఎస్‌ఐఎస్ వైపు ఆకర్షించడానికి కొందరు ఉగ్రవాదులు ప్రాంతాల వారీగా అధ్యయన కేంద్రాలు, అరబిక్ బోధన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. వాట్సాప్, టెలిగ్రామ్‌లో ఏర్పాటు చేసిన గ్రూపుల ద్వారా తమ భావజాలాన్ని ఐసిస్ విస్తరిస్తోందని ఎన్‌ఐఏ గుర్తించింది. చెన్నైకి చెందిన ఉగ్రవాది ఈ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. కొన్ని రోజులపాటు హైదరాబాద్‌లోనూ నివసించిన ఇతగాడు అల్ ఫుర్ఖాన్ పేరుతో ఓ పబ్లికేషన్స్ నిర్వహించాడు. ఇందులో తెలుగు, తమిళం, అరబిక్ భాషల్లో ఉగ్రవాద సాహిత్యం, భావజాలాన్ని వ్యాప్తి చేసే మెటీరియల్ ముద్రించాడు. ఐసిస్ మీడియా వింగ్ పేరు కూడా అల్ ఫుర్ఖానే కావడం గమనార్హం. ఇతగాడు ఇటీవలే విదేశాలకు పారిపోయాడని నిఘా వర్గాలు గుర్తించాయి.

**ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడులు..**

ఈ చెన్నై వాసి నగరంలో నివసించిన కాలంలో సైదాబాద్ పరిధిలోని సపోటాబాద్‌కు చెందిన హసన్, రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్‌కు చెందిన అమీర్, యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలకు చెందిన నూరుల్లా, జాహెద్‌లతో పాటు గోల్కొండ పరిధిలోని షేక్‌పేటకు చెందిన జబ్బార్‌తో సన్నిహితంగా మెలిగాడు. వీరితో పాటు మరికొందరు ఉగ్రవాద సానుభూతిపరులతో సోషల్ మీడియా గ్రూపులు నిర్వహించాడు. తాను ముద్రించిన పుస్తకాలను అందించడంతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన సాఫ్ట్‌కాపీలను షేర్ చేశాడు. కోయంబత్తూరు బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడిగా ఉన్న కేరళ వాసి మహ్మద్ అజారుద్దీన్‌ను ఈనెల 1న ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. ఇతడి నుంచీ ఎన్‌ఐఏ అధికారులు అల్ ఫుర్ఖాన్ ద్వారా ముద్రితమైన సాహిత్యం, పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ పుస్తకాలపై హైదరాబాద్‌లో ముద్రితమైనట్లు చిరునామా ఉంది. దీంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి నగరానికి చెందిన ఐదుగురి వ్యవహారం ఎన్‌ఐఏ దృష్టికి వెళ్లింది. దీంతో శనివారం నగరానికి చేరుకున్న ఎన్‌ఐఏ చెన్నై యూనిట్‌కు చెందిన ప్రత్యేక బృందం ఐదుగురి ఇళ్లపై ఏకకాలంలో దాడి చేసి సోదాలు నిర్వహించింది. అల్ ఫుర్ఖాన్ పబ్లిషర్స్ ద్వారా ముద్రితమైన పుస్తకాలు, ఇతర పత్రాలతో పాటు సెల్‌ఫోన్లు, హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. హసన్, అమీర్, నూరుల్లా, జాహెద్, జబ్బార్‌లకు సీఆర్పీసీ 41–ఏ కింద నోటీసులు జారీ చేశారు.

# కన్నబిడ్డలనే కాల్వలోకి తోసి...

- కల్లు తాగొద్దని భర్త మందలించాడని.. ఓ తల్లి ఘాతుకం
- ముగ్గురు కుమార్తెల మృతి.. దొరకని కుమారుని ఆచూకీ




మహాలక్ష్మి, సాత్విక, మార్కండేయ, మంజుల


తల్లి లలిత

**బిజినేపల్లి:** కల్లు తాగొద్దని భర్త హెచ్చరించాడన్న కోపంతో ఓ తల్లి ముక్కుపచ్చలారని తన నలుగురు చిన్నారులను కాల్వలో విసిరేసింది. ఈ ఉదంతం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఎర్రకుంటతండాలో చోటుచేసుకుంది. మండలంలోని లట్టుపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన లలిత మంగనూర్‌కు చెందిన శరబందను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి కూతుళ్లు మహాలక్ష్మి (7), సాత్విక (5), మంజుల (3)తోపాటు 7 నెలల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో లలిత కొన్నాళ్లుగా మందు కల్లును తాగుతుండటంతో పలుమార్లు భర్త శరబంద మందలించాడు. దీంతో భర్త తరచూ మందలిస్తున్నాడని లలిత శనివారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు శరబందను స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి పిలిచారు. మధ్యాహ్నం కావడంతో పిల్లలకు ఏమైనా తినిపించుకు వస్తానని చెప్పి వెళ్లిన లలిత.. పోలీస్‌స్టేషన్ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలోకి చిన్నారులతో కలిసి దిగింది. అటుగా వెళ్తున్న కొందరు ఆమెను గమనిస్తుండగానే నలుగురు చిన్నారులను కాల్వలోకి విసిరేసింది. వెంటనే వారు బిజినేపల్లి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించి కాల్వలోకి దిగారు. పోలీసులు సైతం కాల్వ వద్దకు వచ్చి గాలించగా.. నీటి ఉధృతికి చిన్నారులు కిలోమీటరు మేర కొట్టుకుపోయారు. చివరికి ముగ్గురు కుమార్తెల మృతదేహాలు లభించగా.. బాలుడు మార్కండేయ ఆచూకీ లభించలేదు. అప్పటికే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చిన్నారులను కాల్వలో విసిరేసిన తల్లిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న భర్త శరబంద సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. చిన్నారుల మృతదేహాలను పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

- అల్పాహారం తిని వాంతులు చేసుకున్న బాలికలు
- పులిహోరలో పురుగులు వచ్చాయని వెల్లడి
- మంచాల బీసీ బాలికల వసతి గృహంలో ఘటన


మంచాల ఆస్పత్రిలో విద్యార్థినులు

**మంచాల:** హాస్టల్‌లో వడ్డించిన అల్పాహారం తిని 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీసీ బాలికల వసతి గృహంలో మొత్తం 94 మంది విద్యార్థినులు ఉన్నారు. శనివారం ఉదయం వీరికి అల్పాహారంగా పులిహోర పెట్టారు. అందులో పురుగులు వచ్చాయని విద్యార్థినులు చెబుతున్నారు. అల్పాహారం తిన్నవారిలో ఒకరి తర్వాత ఒకరు తలనొప్పి, కడుపు నొప్పి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. పదుల సంఖ్యలో పిల్లలు అస్వస్థతకు గురికావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంట వ్యవధిలోనే 30 మందికి పైగా విద్యార్థినులు వాంతులు చేసుకుని, కాళ్లు, చేతులు లాగుతున్నాయని వాపోయారు. వారికి ఆస్పత్రి వైద్యుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి చికిత్స చేశారు. కాగా, తీవ్ర అస్వస్థతకు గురైన కె.అనిత (7వ తరగతి), కె.అఖిల (8), వి.వైష్ణవి (5), ఎం.శిరీష (5), పి.అక్షర (3), ఎం.పూజ (7), ఆర్.త్రిష (10), ఎం.శ్రీనిధి (4వ తరగతి)ని మెరుగైన వైద్యం కోసం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇందులో నలుగురిని వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థుల విషయంలో వార్డెన్‌తో పాటు హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు.


### క్షుణ్ణంగా పరిశీలించాకే.. మైనారిటీ సర్టిఫికెట్

**సాక్షి, హైదరాబాద్:** పోటీ పరీక్షల్లో కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులకు మైనారిటీ హోదా సర్టిఫికెట్ జారీకి ముందు అభ్యర్థులు సమర్పించిన వివరాలను, దరఖాస్తు కారణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మైనారిటీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఈ మేరకు విద్యార్థులకు ఇచ్చే మైనారిటీ సర్టిఫికెట్ నమూనా కూడా జీవోతో పాటు శనివారం జారీ చేశారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బుద్దిస్ట్, జొరాస్ట్రియన్స్‌కు ఈ మైనారిటీ సర్టిఫికెట్ జారీ చేసేటప్పుడు విద్యార్థులు దేనికోసం ఈ సర్టిఫికెట్ కావాలంటున్నారో లిఖితపూర్వకంగా రాయించుకోవాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో తహసీల్దార్‌లు ఆ కుల గ్రూపును పేర్కొనడం, ఎస్సెస్సీ లేదా బదిలీ సర్టిఫికెట్‌లో వారి జాతీయత, మతం, నీట్, ఎంసెట్ లేదా జాతీయ, రాష్ట్ర పోటీ పరీక్షలకు హాజరైన అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు/రేషన్ కార్డు తీసుకుని పరిశీలించాకే జారీ చేయాలని ఆదేశించారు.

### రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై...

# ఈ నెల 19 వరకు స్టే

**హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**



**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై ఈ నెల 19 వరకు హైకోర్టు స్టే విధించింది. ప్రాథమిక సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ.. డీఈవో, డీఎస్ఈతో పాటు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అధికారులు ఇతర జిల్లాలకు చెందిన టీచర్లను కూడా రంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తున్నారని, ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు, నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ టి.శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో 317 ద్వారా ఇతర జిల్లాల టీచర్లను రంగారెడ్డి జిల్లాకు కేటాయించారని, కేడర్‌ను మించిపోతే ఈ జిల్లాకు చెందిన తాము నష్టపోతామని వారు పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అధికారులు తాత్కాలిక సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి బదిలీలు చేపడుతున్నారు. దీనిపై పిటిషనర్ల అభ్యంతరాలకు కూడా అవకాశం ఇవ్వలేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. అయితే తుది సీనియారిటీ జాబితాను జారీ చేయకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం లేదని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు పదోన్నతులు ఇవ్వడం లేదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. లంచ్‌మోషన్‌లో పిటిషన్ వచ్చినందున వివరాలు తెలుసుకోవడానికి ఈనెల 19 వరకు సమయం కావాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను 19కి వాయిదా వేస్తూ, అప్పటివరకు బదిలీలు, పదోన్నతులు నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

**జిల్లా వార్తలు**

### వంట షెడ్డుకు రూ.50 వేల విరాళం


వంటషెడ్ వద్ద విద్యార్థులతో ప్రజాప్రతినిధులు

**తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో వంట షెడ్డు నిర్మాణానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సీతారామపట్నం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వాసిరెడ్డి దయానంద్ రూ.50 వేలు విరాళం అందజేశారు. పాఠశాలలో వంట షెడ్డు లేక ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన బోడేపూడి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో విరాళం అందజేయగా నిర్మాణం పూర్తయింది. శనివారం షెడ్డును ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మారెళ్ల మమత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదరప్రసాద్, హెచ్‌ఎం బి.రమేశ్‌తో పాటు మాదినేని రమేష్, ఎంఎం రాజకుమారి, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### 1,254 కార్లతో విజయభేరికి 'పొంగులేటి' అనుచరులు

**ఖమ్మంమయూరిసెంటర్:** హైదరాబాద్‌లో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన జరగనున్న విజయభేరి సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు భారీగా తరలివెళ్లనున్నారు. సుమారు 1,254 కార్లలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నియోజకవర్గాల నుంచి ఉదయం 10 గంటలకు నాయకులు ఖమ్మం చేరుకోనుండగా, ఇక్కడి నుంచి ర్యాలీగా హైదరాబాద్ బయలుదేరతారని చెప్పారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం:** భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ మహిళలకు రెండు నెలలు ఉచితంగా ఐటీఈఎస్, వెబ్ మొబైల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ శిక్షణకు ఇంటర్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులై, 18–25 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్‌తో ఈ నెల 20న ఉదయం 9 గంటలకు తమ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

**వెబ్‌సైట్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం**

ఐటీడీఏలో వెబ్‌సైట్ నిర్వహణకు వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ తెలిపారు. ఆసక్తి గలవారు కార్యాలయ స్టాటిస్టికల్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

# కార్మికులకు మెరుగైన వైద్యసేవలు


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

**సమీక్ష సమావేశంలో సింగరేణి డైరెక్టర్ బలరామ్**

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డైరెక్టర్ ఎన్.బలరామ్ సూచించారు. కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలో శనివారం ఆయన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)తో పాటు అన్ని ఏరియాల డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలనేదే సంస్థ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించగా, వైద్యనిపుణులను కూడా నియమించామని చెప్పారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కావాల్సిన మందులను సమకూర్చుకోవడమే కాక వైద్యులు సమయపాలన పాటించేలా చూడాలని సూచించారు. సమావేశంలో సీఎంఓ పి.సుజాత, ఏసీఎంఓ విక్టర్ వందనం, డీవైసీఎంఓలు సునీల, పద్మజ, కిరణ్‌రాజ్‌కుమార్, ఉషారాణి, ఎం.కుమారి, పి.రమేశ్‌బాబు, కె.బాలకోటయ్య, మల్లారెడ్డి, సీనియర్ పీఓ మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**వృక్షాలతో మానవాళికి మేలు**

**మణుగూరుటౌన్:** పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు మానవాళి మనుగడలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయని సింగరేణి డైరెక్టర్ బలరామ్ తెలిపారు. మణుగూరు ఏరియాలో శనివారం పర్యటించిన ఆయన ఓసీలో మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హరితహారంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడగా, అధికారులు, నాయకులు వీసం కృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, రవీందర్, వి.ప్రభాకర్‌రావు, రాంగోపాల్, జాన్, ప్రసాద్, కొడిపల్లి శ్రీలత, భుక్యా కిషన్, షబ్బీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

# సత్తాచాటిన 'ఏకలవ్య' విద్యార్థులు


బహుమతులతో విద్యార్థులు

**ములకలపల్లి:** అంకంపాలెంలో కొనసాగుతున్న ములకలపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఇటీవల సిర్పూర్ కాగజ్‌నగర్‌లో జరిగిన నాలుగో రాష్ట్రస్థాయి 4వ కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొనగా ఎనిమిది విభాగాల్లో బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ రాజేశ్, వైస్ ప్రిన్సిపాల్ బానోతు లక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.చైతన్య, ఎం.శ్రీనివాస్ తదితరులు శనివారం అభినందించారు.

# సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహదినమే..

**పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్**



సదస్సులో మాట్లాడుతున్న ఆజాద్

**ఖమ్మంరాపర్తినగర్:** తెలంగాణ ప్రజలను మోసం చేసేలా సెప్టెంబర్ 17ను సమైక్యత, విమోచనం, విలీనం పేరుతో నిర్వహిస్తున్న పార్టీలు చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. అయితే, ఎవరెన్ని కుట్రలు చేసినా కచ్చితంగా విద్రోహ దినమేనని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణలో సెప్టెంబర్ 17న ఏం జరిగింది?' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రజలు రజాకార్లను మట్టి కరిపించారని తెలిపారు. అయితే, ప్రజలను విభజించి పాలించడానికి నాటి కాంగ్రెస్ నుంచి నేటి బీజేపీ వరకు రకరకాల కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాగా, తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు విమోచన దినం పేరిట చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఈనెల 17న విద్రోహ దినంగానే పాటించాలని ఆజాద్ కోరారు. సదస్సులో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్‌తో పాటు నాయకులు సతీశ్, లక్ష్మణ్, కరుణ్, శివ, సతీశ్, నాయకులు శ్రీను, చందు పాల్గొన్నారు.

# త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే


బోనకల్ : బ్రాహ్మణపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న సాంబశివరావు

- పోరాట ఫలితంగానే తెలంగాణకు స్వేచ్ఛ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**బోనకల్/చింతకాని:** త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బోనకల్ మండలం చిరునోముల, బ్రాహ్మణపల్లి, గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురంతో పాటు చింతకాని మండలం ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించిన కూనంనేని మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసమే కాక బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాడారన్నారు. ఇవాళ తెలంగాణ పేరు చెప్పుకుంటున్న పార్టీలది కేవలం ఓట్ల చరిత్రేనని ఆరోపించారు. ఏ గ్రామంలో చూసినా కనిపించే పోరాట స్మృతులు అమరుల త్యాగాలకు గుర్తులని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సైతం తెలంగాణ పోరాటంపై చిత్తశుద్ధి లేదని.. కేసీఆర్ కపట నాటకాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ సమైక్యతాదినం ఎందుకు నిర్వహిస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు తోట రామాంజనేయులు, ఏనుగు గాంధీ, యంగల ఆనందరావు, మందడపు రాణి, తూము రోషన్‌కుమార్, కొంగర రామారావు, జక్కా నాగభూషణం, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పగిడిపల్లి ఏసు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాల్‌రావు, అబ్బూరి మహేశ్, పదిమెల వెంకట నర్సయ్య, బిక్కిరెడ్డి, తాళ్లూరి యాదగిరి, రమేశ్, జానకీరాములు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీలో కార్మిక ఐక్య ఉద్యమాన్ని నిర్మిద్దాం


నినాదాలు చేస్తున్న నాయకులు

**ఖమ్మంమామిళ్లగూడెం:** ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సంఘం 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఖమ్మం డిపో ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గుండు మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. ఐక్య పోరాటాల రూపకల్పన, నిర్మాణంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ అగ్రభాగాన నిలిచిందన్నారు. ప్రస్తుతం కూడా అదేపాత్ర పోషిస్తూ ఆర్టీసీ విలీనం కంటే ముందు మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ.. పే స్కేల్ వర్తింపజేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్‌తో పాటు తోకల బాబు, రమేశ్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, కిరణ్, ఐతం రాజు, నాగేశ్వరరావు, భాస్కర్, ఎండీ గౌస్, శంకర్, కుమార్, వెంకయ్య, మొహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి చేసేదే మనం కదా..!

- కేటీపీఎస్‌లో విద్యుత్ దుబారా
- కర్మాగారంలో రాత్రింబవళ్లు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు


కేటీపీఎస్ 7వ దశలోని భవనాలపై పగలు కూడా వెలుగుతున్న లైట్లు

**పాల్వంచ:** విద్యుత్ ఉత్పత్తి చేసేదే మనం కదా.. అని అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో రాత్రింబవళ్లు హైమాస్ట్ లైట్లను ఆర్పివేయకుండా కొనసాగిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి చేసే రాత్రి వేళ లైట్ల వెలుగులు అవసరముంటుంది. ఇందుకోసం ఏర్పాటుచేసిన భారీ హైమాస్ట్ లైట్ల వల్ల విద్యుత్ అధికంగా వినియోగమవుతుంది. అయితే, పగటి వేళ కొన్ని విభాగాల్లోనే కాక ఆవరణలో లైట్ల అవసరం ఉండదు. అయినప్పటికీ వీటిని ఆర్పేయకపోవడంతో 24 గంటలూ లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు. తద్వారా విద్యుత్ వృథా కావడమే కాక లైట్ల జీవితకాలం తగ్గుతుందని చెబుతున్నారు. కర్మాగారంలోని స్విచ్ యార్డు, క్యాంటీన్, ఫైర్ స్టేషన్, స్టోర్, సీఈ కార్యాలయం ఇలా అనేక ఏరియాల్లో భవనాలపై హైమాస్ట్ లైట్లు నిరంతరం వెలుగుతున్నా సిబ్బంది పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షించకపోవడం విమర్శలకు తావిస్తోంది.